## మున్సిపాలిటీలో విలీనం వద్దు



పరిగి, డిసెంబర్ 18 : తమ గ్రామాన్ని పరిగి మున్సిపాలిటీలో విలీనం చేయరాదని రుక్కుంపల్లి గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం మాజీ సర్పంచ్ ఆర్.శ్రీనివాస్ ఆధ్వర్యంలో మాజీ వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువజన సంఘాల వారు ప్రత్యేక సమావేశం నిర్వహించి తమ గ్రామాన్ని పరిగి మున్సిపాలిటీలో కలపవద్దని తీర్మానించారు. ఈ తీర్మాణం కాపీని గ్రామపంచాయతీ కార్యదర్శికి మాజీ సర్పంచ్ శ్రీనివాస్, గ్రామస్తులు అందజేశారు.

## కొత్త ఓటర్ల నమోదుకు సహకరించండి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ విజయ్‌కుమార్

కొడంగల్, డిసెంబర్18 : కొత్తగా ఓటరు నమోదు చేసుకునే వారికి సహకరించి ఓటు హక్కును పొందేలా ప్రత్యేక దృష్టి సారించాలని తహసీల్దార్ విజయ్‌కుమార్ కోరారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఓటరు జాబితాపై అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 2025 నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు ఓటు హక్కును పొందే విధంగా వారికి సహకరించడంతో పాటు అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు రమేశ్‌బాబు, నందారం ప్రశాంత్, వెంకటయ్యగౌడ్, గుల్షన్, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.



తాండూరు, డిసెంబర్ 18: తాండూరు మాజీ ఎమ్మెల్యే పంజుగుల రోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం అయ్యప్పస్వామి మహా పడిపూజ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. అయ్యప్ప స్వాములు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రోహిత్‌రెడ్డి తల్లి ప్రమోదిని దేవి, తండ్రి విఠల్‌రెడ్డికి పాదపూజ చేశారు. అనంతరం స్వాములకు, భక్తులకు అన్నదాన కార్యక్రమం చేశారు. అయ్యప్ప పడిపూజలో వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు శ్రీశైల్‌రెడ్డి, బీఆర్ఎస్ నేతలు, అభిమానులు పాల్గొన్నారు.

## ఫీజుల బకాయిలు తక్షణమే చెల్లించాలి



వికారాబాద్, డిసెంబర్ 18 : విద్యార్థుల ఫీజుల బకాయిలు తక్షణమే చెల్లించాలని తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రవియాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం వికారాబాద్ ఆర్డీవో కార్యాలయంలో అధికారికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫీజుల బకాయిలు చెల్లించకపోవడంతో పేద విద్యార్థులు తీవ్రంగా నిరాశ చెందుతున్నారన్నారు. ఫీజులు కట్టే స్తోమత లేక చదవాలా వద్దా అనే ఆలోచనలో విద్యార్థులు ఉన్నారని తెలిపారు. కాలేజీ యాజమాన్యాలు కోర్సు పూర్తి అయిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. ఫీజుల బకాయిలు చెల్లించాలని అలాగే స్కాలర్‌షిప్‌రేట్లను పెంచాలన్నారు. గత నాలుగు నెలల నుంచి పెద్ద ఎత్తున విద్యార్థులు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేస్తున్నా తెలంగాణ ప్రభుత్వం తగురీతిగా స్పందించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు.

## ఆటో బోల్తా..నలుగురికి గాయాలు

కులకచర్ల, డిసెంబర్ 18 : ఆటోబోల్తాపడి నలుగురికి గాయాలైన ఘటన కులకచర్ల మండల పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కులకచర్ల గర్క రాములు అనే ఆటోడ్రైవర్ కులకచర్ల గ్రామానికి చెందిన కాకి రాములకు చెందిన జంబు(నాగలి) తన పొలానికి తీసుకెళుతున్న సమయంలో గేదె ఎదురు రావడంతో గేదెను తప్పించ బోయి ఆటో బోల్తాపడింది. అందులో ఉన్న తలారి బుగ్గయ్యకు తీవ్రగాయాలయ్యాయి. అతన్ని వెంటనే 108లో మహ బూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. ముగ్గురికి స్వల్పగాయాలు కాగా స్థానికి ఆస్పత్రిలో చికిత్స పొందారు.

# మానవ అక్రమ రవాణాపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

దోమ, డిసెంబర్ 18: మానవ అక్రమ రవాణా నిరోధక విభా గం, పోలీసు వారి సౌజన్యంతో బుధవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వివిధ సామాజిక అంశాలపై అధికారులు అవగాహన కల్పించారు. మానవ అక్రమ రవాణా, సైబర్ నేరాలు, బాల కార్మిక వ్యవస్థ, ఫేక్‌కాల్స్, బ్లూ లింక్స్‌లతో పాటుగా అపరిచితుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చిన్న పిల్లలను, మహిళలను కొందరు మోసగాళ్లు మాయ మాటలతో ప్రలోబాలకు గురిచేసి ముంబై, ఢిల్లీ వంటి మహానగరాలకు తరలి స్తున్నారని తెలిపారు. చిన్న పిల్లలను తస్కరించి యాచకులుగా తయా రు చేసి వారి ద్వారా డబ్బును సంపాదిస్తారన్నారు. కావున విద్యార్థులు అప్రమత్తతో ఉండాలన్నారు. అనుమానం వస్తే వెంటనే 100 కు గానీ చైల్డ్‌లైన్ హెల్ప్‌లైన్ నంబర్ 1098కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ బీమ్‌రెడ్డి, హెచ్‌ఎం ఆంజనేయులుగౌడ్, ఉపాధ్యాయులు, మానవ అక్రమ రవాణా నిరోధక బృందం సభ్యుడు అలీమొద్దీన్ పాల్గొన్నారు.

## ధరణి సమస్యలను పరిష్కరించాలి



కొడంగల్, డిసెంబర్ 18: ధరణికి సంబంధించిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ ఉమా శంకర్‌ప్రసాద్ సూచించారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ధరణిపై ప్రత్యేక సమీక్ష చేపట్టారు. ఇప్పటి వరకు అందిన దరఖాస్తులు, పరిష్కరించిన వంటి వాటిని తహసీల్దార్‌తో అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు హలో మాల, చలో అసెంబ్లీ

పరిగి, డిసెంబర్ 18 : ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా గురువారం హలో మాల చలో అసెంబ్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు సుల్తాన్‌పూర్ వెంకటయ్య ఒక ప్రకటనలో తెలిపారు. చలో అసెంబ్లీ కార్యక్రమానికి జిల్లాలోని అన్ని మండలాల నుంచి పెద్ద ఎత్తున మాలలు హాజరుకావాలని ఆయన కోరారు. భారీ ఎత్తున అసెంబ్లీ ముట్టడికి హాజరై విజయవంతం చేయాలని ఆయన పేర్కొన్నారు.

**పూడూరు:** నేడు అసెంబ్లీ ముట్టడికి జిల్లాలోని మాలలందరు భారీగా తరలి రావాలని జిల్లా మాల మహానాడు ప్రధాన కార్యదర్శి ఎన్కెపల్లి శ్రీనివాస్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఎస్సీల మధ్యన చిచ్చు పెట్టేందుకు నాయకులే కుట్రలు పన్నుతున్నారని తెలిపారు. ఎస్సీలను రాజ్యాధికారానికి దూరంగా ఉంచేందుకు ప్రభుత్వం యొక్క కుట్రలో భాగమన్నారు. జిల్లా నలుమూలల నుంచి మాలలు భారీ సంఖ్యలో అసెంబ్లీ ముట్టడికి తరలి వచ్చి ఐక్యతను చాటి ఎస్సీ వర్గీకరణ చేపట్టేల డిమాండ్ చేయాలన్నారు.

## శిలాఫలకం ధ్వంసం



పరిగి, డిసెంబర్ 18: పరిగి మండలం రంగాపూర్, మాదారం, నజీరాబాద్‌తండా శివార్లలో నిర్మించనున్న డంపింగ్‌యార్డు కోసం ఏర్పాటుచేసిన శిలాఫలకాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. పరిగి మున్సిపాలిటీకి సంబంధించిన డంపింగ్ యార్డును ఏర్పాటు చేసేందుకు ఈనెల 3వ తేదీన శంకుస్థాపన ఏర్పాట్లు చేయగా రంగాపూర్, మాదారం గ్రామాల రైతులు తీవ్రంగా వ్యతిరేకించారు. రైతులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టడంతో శంకుస్థాపన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి విరమించుకున్నారు. కాగా తహసీల్దార్ ఆనంద్‌రావు, మున్సిపల్ కమీషనర్ వెంకటయ్య కొబ్బరికాయలు కొట్టి శంకుస్థాపన చేశారు. భారీ పోలీసు బందోబస్తు మధ్య శంకుస్థాపన కార్యక్రమం చేపట్టారు. ఇదిలా వుండగా శంకుస్థాపన శిలాఫలకాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు.

## అధిక వడ్డీలు ఇప్పిస్తామంటూ... ఆశచూపి

బంజారాహిల్స్,డిసెంబర్ 18: వ్యాపారంలో లాభాలు, అధిక వడ్డీలు ఆశచూపి కోట్లాది రూపాయలు వసూలు చేసి ముఖం చాటేసిన భార్యాభర్తలతో పాటు ఆమెకు సహకరించిన మరికొందరిపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదయింది. వివరాల్లోకి వెళ్తే.. బంజారాహిల్స్ రోడ్ నెం 14లోని నందిన గర్ గ్రౌండ్స్‌కు సమీపంలోని వెంకటేశ్వరనగర్‌లో నివాసం ఉంటున్న కొడాలి శ్రీలక్ష్మి అనే మహిళ, తన భర్త సత్యప్రసాద్‌తో కలిసి అధిక వడ్డీలు ఇప్పిస్తానంటూ, వ్యాపారంలో పెట్టుబడులు అంటూ స్థానికులను నమ్మించింది. వివిధ కారణాలు చెప్పి ఒక్కొక్కరి నుంచి రూ.2 లక్షల నుంచి 10 లక్షలదాకా ఒకరికి తెలియకుండా మరొకరి నుంచి డబ్బులు వసూలు చేసి కొడాలి శ్రీలక్ష్మి, ఆమె భర్త సత్యప్రసాద్ ఇటీవల ఇంటికి తాళం వేసి ఉడాయించారు. పూచీకత్తు కోసం ఆమె ఇచ్చిన చెక్కులు బౌన్స్ అయ్యాయి. ఈ వ్యవహారంలో తమను నిండాముంచిన కొడాలి శ్రీలక్ష్మి, ఆమె భర్త సత్యప్రసాద్‌తో పాటు ఆమెకు సహకరించిన తన్నీరు పద్మ, తన్నీరు రామకృష్ణ, నిహారిక, దొడ్డపనేని శైలజ తదితరులపై చర్యలు తీసుకోవాలని 20మంది బాధితులు ఫిర్యాదులో కోరారు. ఈ మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. బాధితుల సంఖ్య భారీగా ఉండే అవకాశం ఉండడంతో కేసును సీసీఎస్‌కు బదిలీ చేసే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు.

## చలి @14.7డిగ్రీలు

సిటీబ్యూరో, డిసెంబరు 18 (నమస్తే తెలంగాణ): కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి కంటే తక్కువకు పడిపోతుండడంతో నగరంలో బుధవారం రాత్రి వరకు గరిష్ట ఉష్ణోగ్రతలు 30.6డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రతలు 14.7డిగ్రీలు, గాలిలో తేమ 36శాతంగా నమోదయ్యాయి.

# అల్పహారం ప్రారంభం



విద్యార్థులతో కలిసి అల్పహారం చేస్తున్న ఏఎంసీ వైస్ చైర్మన్, ఎంఈవో

కొడంగల్, డిసెంబర్ 18: దుద్యాల మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న అల్పహార కార్యక్రమాన్ని ఏఎంసీ వైస్ చైర్మన్ ఆకారం వేణుగోపాల్ ఎంఈవో విజయరామారావుతో కలిసి ప్రారంభించారు. బుధవారం విద్యార్థులకు అప్పహారాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అల్పహార కార్యక్రమాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, పాఠశాలకు సమయానికి చేరుకొని మంచి విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అందుకోవాలని సూచించారు.

## కంకల్ హైస్కూల్ విద్యార్థి ప్రతిభ



విద్యార్థి ప్రకాశ్‌కు ప్రశంసా పత్రం అందజేస్తున్న అధికారులు

పూడూరు, డిసెంబర్ 18: పూడూరు మండలం కంకల్ హైస్కూల్ విద్యార్థి ప్రకాష్ జీవశాస్త్ర టాలెంట్ పరీక్షలోఅత్యుత్తమ ప్రతిభ కనబరిచాడు. జిల్లా స్థాయి జీవశాస్త్ర టాలెంట్ పరీక్ష బుధవారం శివరెడ్డిపేట్ హై స్కూల్‌లో నిర్వహించారు. ఈ పరీక్ష రాసిన ప్రకాష్ జిల్లా స్థాయిలో రెండోవ స్థానం సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాడు. అనంతరం ఎంపిక పత్రంతో పాటు ప్రశాంస పత్రంను నిర్వహకులు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం ఏ.పుష్ప విద్యార్థిని, జీవశాస్త్ర ఉపాధ్యాయులు మహేశ్వరి, శ్రీశైలంలను అభినందించారు.

# గురుకులంలో క్రీడోత్సవాలు ప్రారంభం



క్రీడల ప్రారంభోత్సవంలో మున్సిపల్ చైర్మన్ అశోక్, ఎస్ఐ సంతోష్‌కుమార్

పరిగి, డిసెంబర్ 18: విద్యార్థులు చిన్నప్పటి నుంచే క్రీడల్లో పాల్గొంటే చక్కటి ప్రావీణ్యం సాధించవచ్చని, ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని పరిగి మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్, ఎస్ఐ సంతోష్‌కుమార్‌లు సూచించారు. బుధవారం పరిగి పట్టణంలోని మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల గురుకులంలో క్రీడోత్సవాలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడలలోను పాలుపంచుకోవాలని సూచించారు. ప్రతిరోజు కనీసం గంట సమయం క్రీడలకు కేటాయిస్తే తాము ఎంచుకున్న క్రీడలో ఉత్తమ ప్రతిభ కనబరచవచ్చని, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించేందుకు ఉపయోగపడుతుందన్నారు. క్రీడలతో శారీరక ధారుఢ్యంతోపాటు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. ఇలాంటి క్రీడోత్సవాలు క్రీడాకారులలో దాగివున్న ప్రతిభను వెలికితీసేందుకు దోహదం చేస్తాయన్నారు. అంతకుముందు పరిగిలోని ఇండోర్ స్టేడియంలో జిల్లా స్థాయి క్రీడలను మున్సిపల్ చైర్మన్ ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య, కౌన్సిలర్ వెంకటేశ్, బీఆర్ఎస్ నాయకులు బి.రవికుమార్, తాహెర్‌అలీ, మల్లేష్, గురుకులం ప్రిన్సిపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతల స్వీకరణ



కులకచర్ల, డిసెంబర్ 18 : మార్కెట్ కమిటీ అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని కులకచర్ల మార్కెట్ కమిటి చైర్మన్ బీఎస్ ఆంజనేయులు ముదిరాజ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య, పాంబండ దేవాలయ కమిటి చైర్మన్ మహిపాల్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, యూత్ అధ్యక్షుడు కుమ్మరి స్వామి, గోపాల్‌నాయక్, జలీల్, నాయకులు తమ్మలి రాంచంద్రయ్య, బ్లాక్2 అధ్యక్షుడు కర్రె భరత్ కుమార్, యూత్ విభాగం మండల అధ్యక్షుడు జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## నెంబర్‌ప్లేట్ లేని 35 వాహనాలకు జరిమానా



పరిగి, డిసెంబర్ 18 : పరిగి పోలీసులు పట్టణంలో బుధవారం సాయంత్రం వాహనాలు తనిఖీ చేపట్టారు. పరిగి సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ సంతోష్‌కుమార్ పట్టణంలోని ప్రధాన రహదారిపై వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నెంబర్‌లు లేని 35 బైక్‌లను పట్టుకోవడంతోపాటు జరిమానా విధించారు. వాహనదారులు తప్పనిసరిగా మోటర్‌సైకిళ్లను రిజిస్ట్రేషన్ చేయించడంతోపాటు నెంబర్ ప్లేట్లు ఏర్పాటు చేసుకోవాలని వారు సూచించారు.




వికారాబాద్, డిసెంబర్ 18 : సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని బుధవారం వికారాబాద్ ఆర్డీవో కార్యాలయం ముందు నిరవధిక సమ్మెకు దిగారు. ఉద్యోగులకు పీఆర్‌టీయూ టీఎస్ మోమిన్‌పేట శాఖ మద్ధతు తెలిపింది. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు, పీఆర్‌టీయూ టీఎస్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## కంది పంట దగ్ధం..రూ. లక్ష నష్టం



దోమ,డిసెంబర్ 18: ప్రమాదవశాత్తు నిప్పంటుకొని కంది పంట దగ్ధమైన ఘటన మండల పరిధిలోని ఊటుపల్లి గ్రామంలో చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన బాధిత రైతు బండి నర్సయ్య తెలిపిన వివరాల ప్రకారం సాగు చేసిన రెండెకరాల కంది పంటకు మంగళవారం రాత్రి అనుకోకుండా నిప్పు తగిలి పంట మొత్తం దగ్ధమైందని తెలిపారు. పంట దగ్ధం కావడంతో సుమారు లక్ష రూపాయల వరకు నష్టం వాటిల్లిందని రైతు నర్సయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. నష్టానికి ప్రభుత్వం సాయం అందించి ఆదుకోవాలని కోరారు.

## సామాన్ల దొంగ అరెస్ట్..రిమాండ్





నిందితుడు ఇస్మాయిల్ అతడి నుంచి రికవరీ చేసిన సామాన్లు.

తాండూరు రూరల్, డిసెంబర్ 18: సామాన్ల దొంగను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు తాండూరు మండలం, కరణ్‌కోట ఎస్సై విఠల్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన ఇస్మాయిల్ ఈ ఏడాది సెప్టెంబర్ 24 న తాండూరు మండలం, అల్లాపూర్ గ్రామ సమీపంలోని ఓ దుకాణంలో మోటర్ల దొంగతనం కేసులో నిందితుడిగా ఉన్నాడు. నిందితుడితో పాటు ఫిరోజ్, సాదుల్లా, ఖయ్యూం, అక్తర్, జబ్బు, సాబెర్‌లతో కలసి సెప్టెంబర్ 29 న శంకర్‌పల్లిలోని ఓ టెంట్ హౌజ్‌లో సామాన్లు దొంగతనం చేశారు. వారిలో షాదుల్లాను అరెస్టు చేసి విచారించగా, టెంట్ హౌజ్‌లో దొంగతనం చేసింది తామేనని అంగీకరించారు. అందులో కొంత సామాన్లు అమ్ముకున్నట్లు తెలిపాడు. మిగితా సామాన్లను రికవరీ చేశామని ఎస్సై తెలిపారు. ఈ దొంగతనంలో నిందితుడైన ఇస్మాయిల్‌ను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. మిగతాగవారి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

# మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన అధికారులు



పూడూరు మండల కేంద్రంలోని పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ భరత్ కుమార్

పూడూరు, డిసెంబర్ 18: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందజేయాలని ఎంపీడీవో పాండు, తహసీల్దార్ భరత్ కుమార్‌లు పేర్కొన్నారు. బుధవారం పూడూరు మండల పరిధిలోని చన్గోముల్, పూడూరు గ్రామాల్లోని జిల్లా పరిషత్, ప్రాథమిక, ఉర్దూ మీడియం పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని వారు వేర్వేరుగా పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హాస్టల్‌లో విద్యార్థులు అక్కడక్కడ అస్వస్థతకు గురవుతున్నారని తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు విద్యా ర్థుల భోజన సమయంలో పరిశీలించాలని వివరించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రతి రోజు మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని తెలిపారు. నాణ్యమైన పండ్లు, గుడ్లు, కూరగాయలు అందజేయాలని పేర్కొన్నారు. బియ్యం నాణ్యతను పరిశీలించి నూకలు ఉంటే తొలగించాలని వంట నిర్వాహకులకు ఎంపీడీవో పాండు, తహసీల్దార్ భరత్ కుమార్‌సూచించారు.

**మర్పల్లి:** విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం వడ్డించాలని తహసీల్దార్ మునిరొద్దీన్, ఎంపీడీవో రాజమల్లయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కేజీబీవి పాఠశాలను ఎంఈవో అంజిలయ్య, ఎస్సై సురేశ్‌తో కలిసి సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.. గదిలో ఉన్న బియ్యం పరిశీలించారు.. విద్యార్థులకు భోజనాన్ని వడ్డించి వారితో కలిసి భోజనం చేశారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వంటగదిని శుభ్రంగా ఉంచుకోవాలని, నాణ్యమైన కూరగాయాలు, పదర్థాలను వాడాలని సిబ్బందికి సూచించారు.. ఈ కార్యక్రమంలో ఏపీఎం మధుకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

**కులకచర్ల:** విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అం దించాలని కులకచర్ల ఎంపీడీవో రామకృష్ణ అన్నారు. బుధవారం మండల పరిధిలోని పీరంపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వ మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచిం చారు. ప్రభుత్వం విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించేందుకు కృషి చేస్తున్నదని తెలిపారు.

